ఆంధ్రప్రభ
Estd. 1938
www.prabhanews.com
Journalism First!



# ఫ్యూచర్ సిటీకి మెట్రో



## శంషాబాద్ టు ముచ్చర్ల

- ఔటర్ రింగ్ రోడ్డు నుంచి రీజినల్ రింగ్ రోడ్డు వరకు కనెక్టివిటీ
- ఫ్యూచర్ సిటీలో రేడియల్ రహదారులు
- భూసేకరణ వేగవంతం చేయాలి
- అధికారులకు సీఎం రేవంత్ ఆదేశం

**హైదరాబాద్, ఆంధ్రప్రభ బ్యూరో:** హైదరాబాద్ మహా నగరంలో కొత్తగా ఏర్పాటు చేయనున్న ఫ్యూచర్ సిటీ అభివృద్ధిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టిసారించారు. ఈ మేరకు ఆయన శనివారం రాత్రి రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిషోర్, ఇతర అధికారులతో కలిసి సమీక్షించారు. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఫ్యూచర్ సిటీకి రోడ్ కనెక్టివిటీ రూట్ మ్యాప్‌పై అధికారులు సీఎంకు వివరించారు. రూట్ మ్యాప్‌పై పలు సూచనలు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ➪ 10వ పేజీలో...

ఆంధ్రప్రభ
Estd. 1938
www.prabhanews.com
Journalism first!

# ఫ్యూచర్ సిటీకి మెట్రో!



(మూడవ పేజీ తరువాయి)

ఔటర్ రింగ్ రోడ్ నుంచి రీజనల్ రింగ్ రోడ్ వరకు కనెక్టివిటీ ఉండేలా రోడ్ మ్యాప్ సిద్ధం చేయాలని ఆదేశించారు. ఫ్యూచర్ సిటీలో రేడియల్ రోడ్స్ అభివృద్ధి చేసేందుకు వీలుగా ప్రణాళికలు సిద్ధం చేయాలని కోరారు. బుద్వేల్‌లో నిర్మిస్తున్న నూతన హైకోర్టు భవన సముదాయం నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టు మీదుగా ఫ్యూచర్ సిటీకి మెట్రో మార్గం ఉండేలా ప్రణాళికలు రూపొందించాలని సీఎం కోరారు. రోడ్, మెట్రో మార్గాలకు సంబంధించి భూసేకరణ, ఇతర అంశాలపై అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. వీలైనంత త్వరగా పూర్తి స్థాయి ప్రణాళికలు, రూట్ మ్యాప్ సిద్ధం చేయాలని చెప్పిన సీఎం రేవంత్ యుద్ధప్రాతిపదికన పనులు మొదలుపెట్టేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పెట్టుబడులు మాత్రమేకాకుండా రవాణా సదుపాయాలు పూర్తి స్థాయిలో కల్పిస్తేనే బహుళ జాతి సంస్థలు ముందు కొస్తాయని ఆయన అభిప్రాయపడినట్టు సమాచారం. ప్రస్తుతమున్న మెట్రోను ముచ్చర్ల వరకు పొడిగించాలని భావిస్తున్నట్టు సమాచారం. విస్తరణ జరిగితే ఫీజుబులిటీ, అలైన్‌మెంట్, రూట్, భూసేకరణ ఇలా ప్రతీ అంశంపై అధికారులు అధ్యయనం చేస్తున్నారు. దీనికి సంబంధించిన పూర్తి ప్రతిపాదనలు సిద్ధం చేసిన తర్వాత నివేదికను ప్రభుత్వానికి ఇవ్వనుంది. ముచ్చర్ల వరకు మెట్రో విస్తరణకు గ్రీన్ సిగ్నల్ వస్తే, ఇప్పటివరకు అనుకున్న విస్తరణ మరింత పెరిగే అవకాశం ఉంది. ఇప్పటికే దాదాపు 79 కిలోమీటర్లు పెంచాలని అనుకున్నారు. అది ముచ్చర్లకు చేరితే అంచనా వ్యయంతోపాటు కిలోమీటర్లు కూడా పెరిగే ఛాన్స్ ఉంది. ఖర్చు కూడా అమాంతంగా పెరగనున్నట్లు అంచనా వేస్తున్నారు. శంషాబాద్ నుంచి ముచ్చర్లకు మెట్రో రూటు వేయాలంటే దాదాపు 35 కిలోమీటర్లు అదనంగా ట్రాక్ వేయాల్సి ఉంటుంది. కేవలం శంషాబాద్ నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి లింక్ చేయాలన్న ఆలోచన ప్రభుత్వ పరిశీలనలో ఉన్నట్టు తెలుస్తోంది. అమెరికా, కొరియాలకు వెళ్లిన రేవంత్ టీమ్, ముచ్చర్ల సిటీ ప్లాన్ బయటపెట్టింది. ఏఐ సిటీగా దీన్ని రూపొందిస్తున్నట్లు వెల్లడించింది. ఐటీ, స్పోర్ట్స్, మెడికల్, ఎడ్యుకేషన్, టూరిజం, వినోదం వంటి రంగాలు అక్కడ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పుకొచ్చింది. ఇన్ని రంగాలు ఏర్పాటు చేస్తే, ట్రాన్స్‌పోర్టుకు ఎలాంటి సమస్య లేకుండా చేయాలని భావిస్తున్నారు. మరో దఫా ఢిల్లీ వెళ్లనున్న సీఎం రేవంత్‌రెడ్డి పట్టణాభివృద్ధి, ట్రాన్స్‌పోర్టు, రైల్వే మంత్రులతో కలవనున్నారు. మొత్తానికి ఫ్యూచర్ సిటీకి సీఎం రేవంత్ పక్కాగా ప్లాన్ చేస్తున్నట్టు చెబుతున్నారు.